నమస్తే తెలంగాణ

# హనుమకొండ

3 | వరంగల్, ఆదివారం 1 సెప్టెంబర్ 2024 | HANUMAKONDA


# మాకెందుకు మాఫీ కాలే..

## జయ్యారం ఇండియన్ బ్యాంకు వద్ద రైతుల నిరసన



జయ్యారం ఇండియన్ బ్యాంక్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

చిన్నగూడూరు, ఆగస్టు 31 : ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ తమకెందుకు కాలేదని పలువురు రైతులు మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం ఇండియన్ బ్యాంకు వద్ద శనివారం నిరసన తెలిపారు. ఇప్పటి వరకు తమ ఖాతాల్లో రుణమాఫీ డబ్బులు జమకాలేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా బ్యాంకు, వ్యవసాయాధికారుల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం చెప్పడం లేదన్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే ఇండియన్ బ్యాంకు ఖాతాదారులకు రుణమాఫీ కాలేదని ఆరోపించారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో రైతులు చంద్రబాబు, రాములు, చిన్నరాములు, సాయిబాబు, గోవర్ధన్, రామనాథం, కృష్ణ, భిక్షపతి, మల్లయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.



చాంబర్ ప్రతినిధులతో మాట్లాడుతున్న లక్ష్మీబాయి

# ఎగుమతుల పర్మిట్‌ను వినియోగించుకోవాలి

- రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మీబాయి
- మార్కెట్ సెక్రటరీలతో ఎనుమాములలో సమీక్ష

కాశీబుగ్గ, ఆగస్టు 31: ఖరీదు వ్యాపారులు ఆన్‌లైన్ ద్వారా ఎగుమతుల పర్మిట్ పొందేందుకు ప్రతి నెల 10వ తేదీలోగా పర్చేస్ రిటర్న్స్‌ను మార్కెట్ కమిటీ కార్యాలయంలో అందజేయాలని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ సంచాలకులు జీ లక్ష్మీబాయి సూచించారు. శనివారం ఆమె వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రధాన కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతోపాటు ఖమ్మం, జమ్మికుంట, మహబూబాబాద్, జనగామ మార్కెట్ సెక్రటరీలతో సమీక్షించారు. ఈ సందర్భంగా అడ్తి, ఖరీదు వ్యాపారుల సమస్యలు తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వచ్చే సీజన్‌లో ఆన్‌లైన్ ఎగుమతుల పర్మిట్ కోసం ప్రతి ఖరీదు వ్యాపారి మార్కెటింగ్ శాఖ ఇచ్చే ప్రొఫార్మా ప్రకారం వివరాలు అందించాలని సూచించారు. త్వరలోనే సీసీ కెమెరాల ఏర్పాటు, వేబ్రిడ్జిని ఉపయోగంలోకి తెస్తామన్నారు. అదనంగా పీవోసీ మిషన్లు కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. మద్దతు ధరతో వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు త్వరలోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఆమె లక్ష్మీపురంలోని మోడల్ కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. షెటర్ల అద్దె తగ్గించాలని రిటైల్ వ్యాపారులు వినతిపత్రం అందజేశారు. అదనపు సంచాలకుడు పీ రవికుమార్, ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు ఉప్పుల శ్రీనివాస్, ప్రాంతీయ ఉప సంచాలకుడు వీ పద్మావతి, హనుమకొండ డీఎంవో కే సురేఖ, ఎనుమాముల మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, చాంబర్ అధ్యక్ష కార్యదర్శులు రవీందర్‌రెడ్డి, వేదప్రకాశ్ పాల్గొన్నారు.

# ప్రైవేట్ వైద్యశాలల్లో హైడోస్ యాంటీబయోటిక్స్

## ములుగు డీఎంహెచ్‌వో తనిఖీలో వెల్లడి



రోగి వివరాలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో

ఏటూరునాగారం, ఆగస్టు 31 : మోతాదుకు మించి సెలైన్లలో హైడోస్ యాంటీబయోటిక్ ఇంజెక్షన్లను రోగులకు ఇస్తున్న విషయం మండలకేంద్రంలోని అపోలో వైద్యశాలలో శనివారం వెలుగు చూసింది. డీఎంహెచ్‌వో అప్పయ్య శనివారం అపోల్లో, తేజ చిన్న పిల్లల వైద్యశాలలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహా ఆదేశాల మేరకు ప్రైవేట్ వైద్యశాలలను తనిఖీ చేసినట్లు తెలిపారు. అపోలో వైద్యశాలలో ఐదుగురు రోగులకు సెలైన్ ఇవ్వగా అక్కడ ఉన్న నర్సును డ్రగ్ వివరాలు తెలుసుకోగా 100 ఎంఎల్ ఎన్ఎస్‌లో సిఫాఫెరజోన్ అనే హైయ్యర్ యాంటీ బయోటిక్ ఇస్తున్నట్లు చెప్పడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. దశల వారీగా కాకుండా ఒకేసారి నేరుగా హైడోస్ ఇవ్వడం వల్ల రోగి నిరోధక శక్తిని తగ్గించినట్లు అవుతుందన్నారు. ల్యాబ్ టెస్టుల ధరల పట్టిక లేకపోవడంపై దవాఖానకు మెమో జారీ చేస్తున్నట్లు తెలిపారు. వైద్యశాల అనుమతి పత్రాలను పరిశీలించారు. అనంతరం మండలకేంద్రలోని ఎస్సీ కాలనీలో డ్రై డే నిర్వహించి దోమల నివారణపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. రొయ్యూరు సబ్ సెంటర్‌ను సందర్శించి స్థితి గతులను నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట రొయ్యూరు మెడికల్ ఆఫీసర్ సుమలత ఉన్నారు.

# పరిసరాలు ఇలాగేనా..?

## హెచ్‌ఎంపై వరంగల్ కలెక్టర్ ఆగ్రహం



అశోక్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో బురదమయమైన ఆవరణను దాటుతున్న కలెక్టర్

ఖానాపురం, ఆగస్టు 31: పాఠశాల పరిసరాలు ఇలాగేనా ఉండేదని వరంగల్ కలెక్టర్ సత్యశారద హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆమె వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె వర్షపు నీటితో నిండిన స్కూల్ ఆవరణను చూసి అవాక్కయ్యారు. బురదలో నుంచే పాఠశాలలోకి వెళ్లారు. ఆవరణ ఇలా ఉంటే విద్యార్థులు ఎలా వస్తారని ప్రశ్నించారు. వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు.



మాట్లాడుతున్న దాస్యం వినయ్ భాస్కర్, పక్కన మాజీ ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, రాజయ్య, నరేందర్

# కాంగ్రెస్ హయాంలోనే అంతులేని అవినీతి

- ప్రాజెక్టులపై అవగాహన ఉన్న కడియం ఎందుకు మాట్లాడలేదు
- విలేకరులతో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం
- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు పెద్ది, తాటికొండ, నన్నపునేని

హనుమకొండ చౌరస్తా, ఆగస్టు 31 : కాంగ్రెస్ హయాంలోనే అంతులేని అవినీతి జరిగిందని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. శనివారం హనుమకొండ బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మంత్రుల బృందం దేవాదుల ప్రాజెక్టుపై ఎలాంటి అధ్యయనం చేయకుండా చిల్లర మాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. సమైక్య రాష్ట్రంలో దండగైన వ్యవసాయాన్ని కేసీఆర్ తన హయాంలో పండుగలా మార్చారని అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణంలోనూ, ఇతర అంశాల్లోనూ తెలంగాణకు అన్యాయం జరిగిందని అప్పటి ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. 2003లో ఎన్నికల నేపథ్యంలో హుటాహుటిన తాపీ మేస్త్రీ తదితరులను ఒకే హెలికాప్టర్‌లో తీసుకొచ్చి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో దేవాదుల ప్రాజెక్ట్‌కు పునాది వేయించాడని, అప్పటి నుంచి 2014 వరకు ఎలాంటి పనులు జరగలేదన్నారు. 2008లో ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4 వేల కోట్లుంటే, కాంగ్రెస్ హయాంలో దానిని రూ.10వేల కోట్లకు పెంచి అవినీతికి పాల్పడ్డారని అన్నారు. అప్పుడు టీడీపీ, మొన్న బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్‌లో ఉన్న కడియం శ్రీహరి ప్రాజెక్ట్‌లపై అవగాహన ఉండికూడా ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అపర భగీరథుడని, 1.20 కోట్ల ఎకరాలకు సాగునీరందించిన ఘనత ఆయనకే దక్కుతుందని కడియంశ్రీహరి ప్రశంసించారన్నారు. 100 టీఎంసీల నీటిని దేవాదులకు కేటాయించడం హర్షనీయమని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని కడియం శ్రీహరి మాట్లాడిన వీడియోను వినయ్‌భాస్కర్ చూపించారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉత్త మాటలే చెప్తున్నారని, ఆయన పక్కన ఉండి కూడా కడియం శ్రీహరి మాట కూడా మాట్లాడలేదన్నారు. శ్రీహరి పార్టీలు మారొచ్చు కానీ మాట మార్చవద్దని హితవు పలికారు. రైతును రాజు చేయాలనే లక్ష్యంతో ప్రపంచంలోనే అతిపెద్దదైన కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, అన్నదాతల కోసం అనేక సంక్షేమ పథకాలు అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఆరు గ్యారెంటీలు, అలవికాని 420 హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ పైన ప్రజల్లో అసహనం పెరిగిందని, వారి ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడే నిలదీస్తున్నారని అన్నారు. అందుకే ఫోన్ టాంపరింగ్, మేడిగడ్డ, దేవాదుల అంటూ డ్రామాలాడుతున్నారని మండిపడ్డారు. సకాలంలో రుణమాఫీ చేయక, రైతు భరోసా ఇవ్వక, ఎరువులు, విత్తనాలు అందించని దద్దమ్మ ప్రభుత్వమని ఎద్దేవా చేశారు.

## కడియం శ్రీహరి రాజీనామా చేయాలి

– తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే, స్టేషన్‌ఘన్‌పూర్

వ్యవసాయరంగం మీద ఎలాంటి అవగాహన లేకుండా కాంగ్రెస్ మంత్రులు మాట్లాడడం సరికాదని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య అన్నారు. అనేక ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టి తెలంగాణను సస్యశ్యామలం చేయడంతో రైతులు పంజాబ్, హర్యానాతో పోటీ పడి మూడు కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి చేశారని తెలిపారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంటును ఐక్యరాజ్యసమితి మెచ్చుకుందన్నారు. కడియం శ్రీహరి, మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సిగ్గు, శరం లేకుండా మాట్లాడుతుండడం సిగ్గుచేటన్నారు. కడియం శ్రీహరి ఏ ఎండకు ఆ గొడుగు పడతాడని, దేవాదుల నిర్మాణం ఆలస్యమవుతుందనే ఉద్దేశంతో 2003లోనే పిండాలు పెట్టానని గుర్తుచేశారు. 2022లోనే పూర్తయ్యే ప్రాజెక్టును అడ్డుకున్నది కూడా కడియం శ్రీహరేనని, ఈ పనుల విషయమై తాను, పల్లా రాజేశ్వర్‌రెడ్డి కేసీఆర్‌ను కలవగా రూ.134 కోట్లు అదనంగా కేటాయించినట్లు చెప్పారు. దిగజారుడు రాజకీయాలను మానుకోవాలని, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారుల కష్టంతో గెలిచిన కడియం శ్రీహరి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. పోయే కాలానికి దగ్గరగా ఉన్నావని, ఇప్పటికైనా ప్రజలకు మంచి చేయాలని హితవు పలికారు.

## మంత్రి ఉత్తమ్ జైలుకెళ్లడం ఖాయం

– పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నర్సంపేట

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అప్పుడు మంత్రిగా పనిచేసి వందల కోట్లు దోచుకున్నాడని, రాష్ట్రవ్యాప్తంగా సివిల్ సప్లయిస్‌లో కొన్ని వందల కోట్ల కుంభకోణం చేశాడని, ఆయనకు జైలు తప్పదని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే సివిల్ సప్లయిస్‌లో కుంభకోణానికి తెరతీశారని, ప్రతినెలా రూ. 1100 కోట్లు ఎవరెవరి ఖాతాలో, ఏబ్యాంకులో జమవుతున్నాయో తమకు తెలుసన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో దేవాదుల ప్రాజెక్టును 90 శాతం పూర్తిచేసినప్పటికీ ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. కాంగ్రెస్‌లో ఒకరికొకరికి పడడంలేదని, తిట్టిన వారికి పార్టీ ఏదో న్యాయం చేస్తుందనుకుంటే పొరపాటేనన్నారు. మేడిగడ్డపైన కమిషన్ విచారణ జరుగుతుండగానే దానిపైన ఇష్టం వచ్చినట్లు మాట్లాడడం సిగ్గుచేటన్నారు. రైతుల వద్ద క్వింటాల్ ధాన్యం రూ.2,007కు తీసుకొని, రూ. 2,230 ప్రభుత్వం ఇస్తున్నట్లు చెబుతున్నారని, ఈ డబ్బులు ఎటుపోతున్నాయో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1,270 చెరువులు జూలై మొదటివారం వరకు నిండు కుండలా కనిపించేవని, ఇప్పుడు నీళ్లు లేక వెలవెలబోతున్నాయన్నారు. అవకాశం ఉన్నప్పటికీ దేవాదుల నీటిని ఎత్తిపోసేందుకు అనుమతి ఇవ్వలేని దద్దమ్మ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని అన్నారు.

## ప్రజాపాలన కాదు.. హింసించే పాలన

– నన్నపునేని నరేందర్, మాజీ ఎమ్మెల్యే, వరంగల్ తూర్పు

కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదని, ప్రజలను హింసించే పాలన వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. రైతులకు ఇచ్చిన మాటను కూడా నిలబెట్టుకోలేక వారిపై అసహనం వ్యక్తం చేస్తున్నారని, కక్ష చూపుతున్నారని మండిపడ్డారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓ డెకాయిట్ అని, కేసీఆర్‌పై తప్పుడు మాటలు మానుకోవాలన్నారు. తెలంగాణను పాలించే అర్హత కాంగ్రెస్‌కు లేదని, రైతులకు చేసిందేమీ లేదన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతు రుణ విమోచన కమిషన్ మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ జనార్దన్‌గౌడ్, కోఆర్డినేటర్ పులి రజనీకాంత్, బీఆర్ఎస్ హసన్‌పర్తి మండలాధ్యక్షుడు బండి రజినీకుమార్, మైనార్టీసెల్ అధ్యక్షుడు మహ్మద్ నయీముద్దీన్, మాజీ కార్పొరేటర్ జోరిక రమేశ్, శ్రవణ్ కుమార్, విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యుడు పోలేపల్లి రామ్మూర్తి, 10వ డివిజన్ అధ్యక్షుడు ఖలీల్, 29వ డివిజన్ అధ్యక్షుడు సదాంత్, రవీందర్‌రావు, వీరస్వామి, పానుగంటి శ్రీధర్, రఘు సంపతీ పాల్గొన్నారు.

# ముంచెత్తిన వాన



గోవిందరావుపేట : పస్రా-మేడారం దారిలో భక్తులను ఒడ్డు దాటిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జోరు వర్షం



ఖానాపురం : నాజీతండా శివారులో లో లెవల్ కాజ్‌వే నుంచి ప్రవహిస్తున్న వరద

- లో తట్టు ప్రాంతాలు జలమయం, కూలిన ఇండ్లు
- ములుగు జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు
- పర్యాటక ప్రదేశాల సందర్శన నిలిపివేత
- నెక్కొండ మండలంలో అత్యధికంగా 10.17 సెంటీమీటర్లు నమోదు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా భారీ వర్షం కురిసింది. శుక్రవారం రాత్రి నుంచి శనివారం పొద్దంతా కురిసిన వానకు వాగులు, వంకలు ఉప్పొంగాయి. పంట పొలాలు నీటమునగగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇండ్లలోకి నీరు చేరి ప్రజలు ఇబ్బందిపడ్డారు. కల్వర్టులు, రహదారులపై నుంచి వరద పోటెత్తడంతో పలు ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరంగల్ జిల్లాలో సగటు వర్షపాతం 5.96 సెంటీమీటర్లు కాగా, అత్యధికంగా నెక్కొండ మండలంలో 10.17సెంటీ మీటర్లుగా నమోదైంది. భారీ వర్షానికి చెన్నారావుపేటలో కట్టమ్మకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. జల్లి గ్రామంలో రేకులషెడ్ పైకప్పు ధ్వంసమైంది. పర్వతగిరి మండలం పెద్దతండాలో ఇండ్లల్లోకి నీరు చేరి తండావాసులు ఇబ్బందిపడ్డారు. మహబూబాబాద్ జిల్లాలోని కొత్తగూడ, గంగారం, గూడూరు, తొర్రూరు, నర్సింహులపేట, చిన్నగూడూరు, దంతాలపల్లి, పెద్దవంగర మండలాల్లో భారీ వర్షం కురిసింది. మహబూబాబాద్ పట్టణంలోని నిజాంచెరువు, మున్నేరు వాగు, గార్ల మండలంలోని పాకాల ఏరు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తొర్రూరు మండలంలో గంటపాటు కురిసిన వర్షానికి అమ్మాపురం, ఎలికట్ట చెరువులు మత్తడి పోస్తున్నాయి. పద్మశాలీ బజార్ ఎస్‌బీఐ రోడ్డులోని ఇండ్లలోకి వరదనీరు చేరి స్థానికులు ఇబ్బందిపడ్డారు. పెద్దవంగర మండలంలోని విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ములుగు జిల్లా ములుగు మండలంలోని సర్వాపురం-జగ్గన్నగూడెం గ్రామాల మధ్యలో బొగ్గులవాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో జగ్గన్నగూడెం, సర్వాపురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఏటూరునాగారం మండలంలో పిడుగుపాటుకు పలు ఇండ్లలోని రిఫ్రిజిరేటర్లు, టీవీలు, ఫ్యాన్లు కాలిపోయాయి. దొడ్ల, ఎలిశెట్టిపల్లి సమీపంలో జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. మంగపేట మండలం మంగపేట-బోరునర్సాపురం గ్రామాల మధ్య గౌరారం వాగు ఉధృతి బోరునర్సాపురం తీరం వైపునకు మళ్లడంతో ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. తాడ్వాయి మండలం మేడారంలో జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు మళ్లీ మత్తడి పోస్తున్నది. వెంకటాపురం(నూగూరు) మండలం మొర్రవానిగూడెం గ్రామానికి చెందిన మల్లమ్మకు చెందిన ఇల్లు కూలిపోయింది.

భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని దేవరాంపల్లి, శంకరంపల్లి, బొప్పారం, దామెరకుంట తదితర గ్రామాల్లో పత్తి పంటలు నీట మునిగాయి. గోపాల్‌పూర్ గ్రామంలో దుర్గం రాజు ఇల్లు ధ్వంసమైంది. హనుమకొండ, జనగామ జిల్లాలో మోస్తరుగా వర్షం కురిసింది. కాగా, వర్షాల నేపథ్యంలో ఆయా జిల్లాల కలెక్టరేట్లు, మండలస్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు.

## ములుగు జాతీయ రహదారిపై రాకపోకలు బంద్

గోవిందరావుపేట : ములుగు జిల్లా పస్రా-తాడ్వాయి మధ్యలో జనగలంచ వద్ద వరద ఉధృతి కారణంగా ఎన్‌హెచ్-163పై శనివారం సాయంత్రం రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మేడారం మీదుగా మంగపేటకు వాహనాలు తరలిస్తున్న క్రమంలో ఆ రోడ్డులో వెంగళాపురం సమీపంలో బాంబులగడ్డ ఒర్రె ఉప్పొంగడంతో అటువైపు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మేడారం వచ్చిన భక్తులను తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి ఒర్రె దాటించారు. రెండు వైపులా రాకపోకలు నిలిచిపోవడంతో పోలీసులు పస్రాలోనే వాహనాలను నిలిపివేయగా, ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు.



మహబూబాబాద్ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న మున్నేరువాగు

## పర్యాటక ప్రాంతాల సందర్శన నిలిపివేత

వెంకటాపూర్ : ములుగు జిల్లాలో బొగత జలపాతం, లక్నవరం, రామప్ప సరస్సు తదితర పర్యాటక ప్రాంతాల సందర్శనను నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ దివాకర టీఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టేవరకు పర్యాటక ప్రాంతాలకు రాకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.



చెన్నారావుపేట : పాపయ్యపేటలో ఇండ్లలోకి చేరిన నీరు



పర్వతగిరి : పెద్దతండాలో ఇంటిలోకి చేరిన నీరు



పెద్దవంగర : గంట్లకుంటలో విరిగిన విద్యుత్ స్తంభం



మంగపేట : గౌరారం వాగు ఉధృతికి కోతకు గురవుతున్న భూమి

# ఇద్దరు ఘరానా దొంగల అరెస్టు..

- రూ.22.57లక్షల విలువైన నగలు, స్కోడా కారు స్వాధీనం
- జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ వెల్లడి



నిందితులను అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజమహేంద్రనాయక్

జనగామ, ఆగస్టు 31 (నమస్తే తెలంగాణ) : శ్రమపడకుండా ఈజీ మనీకి అలవాటు పడి ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు ఘరానా దొంగలను శనివారం పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.22.57లక్షల విలువైన నగలు, స్కోడా కారు స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను జనగామ డీసీపీ రాజమహేంద్రనాయక్ శనివారం విలేకరులకు వెల్లడించారు. హనుమకొండ రెవెన్యూ కాలనీలో నివాసముంటున్న కాజీపేట బాపూజీనగర్‌కు చెందిన హోటల్ వ్యాపారం చేసే బంగారి నరేశ్ కుమార్ (33), టైలరింగ్ పనిచేసే వరంగల్ ఎల్‌బీనగర్ ఏనుమాముల మార్కెట్ ప్రాంతానికి చెందిన మహ్మద్ ఆసీఫ్ పాషా(35)ను జనగామ-హనుమకొండ హైవేపై యశ్వంతపూర్ ఎల్లమ్మ గుడి వద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.17.50 లక్షల విలువైన 25 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.27లక్షల విలువైన వెండి ఆభరణాలు, రూ.3.79 లక్షల నగదు, స్కోడా కారును స్వాధీనం చేసుకున్నట్లు రాజమహేంద్రనాయక్ తెలిపారు. గోవాలో హోటల్ వ్యాపారం చేసి నష్టపోయిన నరేశ్‌కుమార్ కొడుకు ఆపరేషన్ కోసం చాలా డబ్బు ఖర్చు కావడంతో వరంగల్‌కు మకాం మార్చగా ఏనుమాముల మార్కెట్ వద్ద ఆసీఫ్‌షాపా పరిచయమయ్యాడు. ఇద్దరు చేస్తున్న వృత్తుల వల్ల వస్తున్న డబ్బు సరిపోక సులభంగా సంపాదించాలని దొంగతనాలను వృత్తిగా ఎంచుకున్నారని డీసీపీ వివరించారు. జనగామ, నర్సంపేట, కేయూసీ, భూపాలపల్లి, తొర్రూరు, సుబేదారి, వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ల పరిధిలో రాత్రి, పట్టపగలు ఇంట్లో ఎవరూలేని తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. జనగామ పట్టణంలోని హనుమకొండ రోడ్డులో వాహనాల తనిఖీ చేస్తుండగా చోరీ కోసం పథకం రూపొందించి కారులో వస్తున్న వీరు పోలీసులను చూసి యూటర్న్ తీసుకొని పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నట్లు డీసీపీ రాజమహేంద్రనాయక్ వివరించారు. దొంగలను గుర్తించి పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన అర్బన్ సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు భరత్, చెన్నకేశవులు, సీసీఎస్ సీఐ, సిబ్బంది, ఏఎస్ఐ శంకర్, కానిస్టేబుళ్లు టీ రామన్న, రామకృష్ణ, కే అనిల్‌కుమార్, సురేశ్‌కుమార్, ఏఏవో సల్మాన్‌పాషాను వరంగల్ కమిషనర్ అభినందించారు. విలేకరుల సమావేశంలో ఏసీపీ పార్థసారథి, సీఐ దామోదర్‌రెడ్డి, ఎస్సైలు భరత్, చెన్నకేశవులు పాల్గొన్నారు.



స్వీట్ల తయారీని ప్రారంభిస్తున్న పీఠాధిపతి ఖుస్రుపాషా

# బాహుబలి వంట పాత్ర

- ఒకేసారి ఏడు వేల మందికి భోజనం
- ప్రారంభించిన బియాబానీ దర్గా పీఠాధిపతి ఖుస్రుపాషా

కాజీపేట, ఆగస్టు 31 : హనుమకొండ కాజీపేట పరిధిలోని సయ్యద్ షా అఫ్జల్ బియాబానీ ఉత్సవాల సందర్భంగా దర్గా ప్రత్యేకంగా బాహుబలి పాత్రను ఏర్పాటు చేశారు. ఈ పాత్రలో ఒకేసారి ఏడు వేల మందికి సరిపోయేలా ఒకేసారి 1,100 కేజీల బియ్యంతో (శాఖాహారం) భోజనాన్ని తయారు చేయనున్నారు. దాదాపు 800 ఏండ్ల క్రితం అక్బర్ ఆస్థానంలోని అజ్మీరా దర్గాలో 25 వేల మందికి భోజనం అందించేందుకు ఇలాంటి పాత్రను ఏర్పాటు చేసినట్లు దర్గా పీఠాధిపతి, హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా తెలిపారు. హైదరాబాద్‌లో ప్రత్యేకంగా బాహుబలి పాత్రను తయారు చేయించామని, దర్గా ప్రాంగణంలోనే పెద్ద బట్టీ పెట్టి కట్టెలతో వంట చేసేలా ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం సాయంత్రం ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులకు అందించేందుకు వంటకాలను ప్రత్యేక ప్రార్థనలు చేసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో యువ పీఠాధిపతి భక్తియార్ బియాబానీ, మన్సూద్ బియాబానీ, మాజీ కార్పొరేటర్ అబూబక్కర్ పాల్గొన్నారు.

# చీకట్లోనే వైద్యం

- ఆయుర్వేద వైద్యశాలకు విద్యుత్ అంతరాయం
- నాలుగున్నర గంటల పాటు వైద్యులు, రోగుల ఇబ్బంది



చీకట్లోనే సేవలందిస్తున్న వైద్యులు

వరంగల్ చౌరస్తా, ఆగస్టు 31 : ఉమ్మడి వరంగల్, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల పరిధిలోని రోగులకు ఆయుర్వేద వైద్యసేవలందిస్తున్న వరంగల్ లేబర్‌కాలనీలోని అనంతలక్ష్మి ఆయుర్వేద వైద్యశాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. నాలుగున్నర గంటల పాటు సరఫరా నిలిచిపోవడంతో వైద్యులు చీకట్లోనే వైద్యం అందించారు. శనివారం వారాంతం కావడంతో విద్యుత్ శాఖ అధికారులు నిర్వహణ కోసం కరెంట్‌ను ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిలిపివేశారు. దీంతో ఆస్పత్రిలో అంధకారం అలుముకోగా, వైద్యులు, ఔట్, ఇన్ పేషెంట్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆయుర్వేద వైద్యశాలగా గుర్తింపున్న ఆస్పత్రిలో కనీసం జనరేటర్ సౌకర్యం లేదు. విద్యుత్ సమస్యతో రోజు విడిచి రోజు నిర్వహించే శస్త్రచికిత్సలు సైతం నిలిపివేయాల్సి వస్తున్నదని వైద్యులు తెలిపారు. ఈ విషయమూ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా గతంలోనే జనరేటర్ కోసం విన్నవించామని, సోమవారం కలెక్టర్‌ను కలిసి మరోమారు వినతిపత్రం అందిస్తామన్నారు.